క్లుప్తంగా

పల్లెప్రగతి పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మాల్తుమ్మెదలో మంగళవారం ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ పల్లెప్రగతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన చెత్తసేకరణ, మురికాలువలు శుభ్రం చేసే పనులను ఆయన పరిశీలించారు. దీంతోపాటు కంపోస్టుషెడ్డులో కంపోస్టు ఎరువు తయారీని ఆయన పరిశీలించారు. గ్రామశివారులో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలను ఆయన పరిశీలించారు. మొక్కలు అన్నీ మొలకెత్తడంతో వనసేవకుడు రాములను సత్కరించారు. ఎల్లారెడ్డి డివిజన్‌లోనే మాల్తుమ్మెద నర్సరీ ఆదర్శంగా ఉందని పేర్కొన్నారు. జీపీలో రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి నర్సింలు ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా అబ్బాగౌడ్



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండల పరిషత్ ఎంపీవోగా అబ్బాగౌడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిజాంసాగర్ నుంచి డిప్యూటేషన్‌పై లింగంపేటకు వచ్చారు. లింగంపేట ఎంపీవోగా పనిచేసిన ప్రభాకర చారి మాచారెడ్డికి బదిలీపై వెళ్లారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బాధ్యతలు తీసుకున్న డి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు శాలువాతో సన్మానం చేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.సాయిలు, కేంద్ర సంఘం కార్యదర్శి ఎం.నాగరాజు, ప్రతినిధులు తదితరులున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సునంద పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నసీనాబేగం, అంగన్‌వాడీ టీచర్లు బాలింతలు తదితరులు ఉన్నారు.

కామారెడ్డి కళాశాలలో సామాజిక పని దినోత్సవం



కామారెడ్డి అర్బన్ : సమాజంలో ప్రతిఒక్కరు ఏదో ఒక మానసిక, వ్యక్తిగత, కుటుంబ, సాంఘిక సమస్యలతో బాధపడుతున్నందున ఎదుటివారి పట్ల ప్రేమ, ఆపాయ్యత, సహాయ భావనతో మెలగాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. కళాశాల సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ సామాజిక పని దినోత్సవం నిర్వహించారు. కళాశాల సోషల్ వర్క్ విభాగం అధిపతి ఎం చంద్రకాంత్ మాట్లాడుతూ 'సామరస్యంగా జీవించడం, పరివర్తన మార్పు కోసం భాగస్వామ్య భవిష్యత్తు' నినాదంతో ఈ ఏడాది వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే కిష్టయ్య, అకడమిక్ సమన్వయకర్త వి.శంకరయ్య, హిందీ విభాగం అధ్యక్షుడు జి.శ్రీనివాస్, సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్జాల్ తండాను సందర్శించిన ఆర్డీవో



గాంధారి: మండలంలోని గుర్జాల్ తండాను ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ మంగళవారం సందర్శించారు. వీధుల్లో తిరిగి మురికాలువలను, వాటర్ ట్యాంకును పరిశీలించారు. తండాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో చెత్తా లేకుండా శుభ్రం చేయించాలని, ఇళ్ల ఎదుట పెంట కుప్పలు లేకుండా చూడాలని జీపీ కార్యదర్శిని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

నీటి కోసం నిలదీత

- భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు
- అసంపూర్తి రోడ్డు నిర్మాణ పనులపై ఆగ్రహం
- ప్రైవేట్ డీలర్లు ఎరువులు అమ్మడంపై అభ్యంతరాలు
- సదాశివనగర్ మండల పరిషత్ సమావేశంలో అధికారుల నిలదీత



సదాశివనగర్ మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కమిలి నర్సింలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులకు నిలదీతలు తప్పలేదు. కుప్రియాల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మిషన్‌భగీరథ నీటి కనెక్షన్లు లేవని గ్రిడ్ ఏఈ రజిత, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ శ్రీధర్‌రెడ్డిని జెడ్పీటీసీ కమిలి నర్సింలు నిలదీశారు. సదాశివనగర్, అడ్లూర్‌ఎల్లారెడ్డిలో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, అమర్లబండ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు పనులు నిలిపేశారని జెడ్పీ కోఆప్షన్ మోహినొద్దిన్ పీఆర్‌ఏఈ మారుతిని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేస్తామని, అడ్లూర్ ఎల్లారెడ్డిలో పనులు జరుగుతున్నాయన్నారు. అమర్లబండ బ్రిడ్జి నిర్మాణ కోసం సర్వే చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కరెంట్ మీటర్లు లేని వారి పరిస్థితి ఏంటని జెడ్పీటీసీ నర్సింలు ఏఈ ధర్మారెడ్డిని ప్రశ్నించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో దేవాదాయ భూమిలో నిర్మాణాలకు కరెంట్ ఎలా ఇస్తారని ఏఈపై, నిర్మాణాలకు అనుమతి ఎలా ఇస్తారని ఎంపీవో సురేందర్ రెడ్డిలపై ఎంపీటీసీ బీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ డీలర్లు ఎరువులు అమ్మడమేమిటని వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి ఏఈ, ఏవో ప్రజాపతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఉర్దూ టీచర్ లేక ఇబ్బందిగా ఉందని మండల కో-ఆప్షన్ అల్తాఫ్ ఎంఈవో యోసెఫ్‌ను కోరారు. సదాశివనగర్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు టీచర్లుండగా వారు ఇటీవల పాఠశాలకు రాలేదని వారిపై చర్యలేమిటని ఎంఈవోపై ఎంపీటీసీ బీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సదాశివనగర్‌లో ఉపాధి హామీ పథకంలో అక్రమాలను మండల స్థాయి సామాజిక తనిఖీల్లో బయటకు ఎందుకు రానివ్వలేదని ఎంపీవో మధుపై ఎంపీటీసీ బీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువైద్య శాల తెరవడం లేదని ఎంపీటీసీ బీరయ్య సభాదృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గైని అనసూయ, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహశీల్దార్ గంగాసాగర్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీరో బిల్లుల కోసం పరుగులు

- చాలా గృహాలకు అందని గృహజ్యోతి పథకం
- కార్యాలయాల చుట్టూ వినియోగదారులు



జీరో బిల్లులు అందజేస్తున్న విద్యుత్ అధికారులు

బాన్సువాడ : జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు మండల, మున్సిపల్ కార్యాలయాల వైపు పరుగులు పెడుతున్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ప్రభుత్వ ప్రకటించింది. దీంట్లో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి విద్యుత్ సంస్థ జీరో బిల్లుల జారీ చేపట్టింది. గత నెలలో బిల్లుల జారీ చేసిన క్రమంలో వినియోగదారుల తెల్లరేషన్, ఆధార్ కార్డుల నంబర్లను విద్యుత్ సర్వీసు నంబర్‌తో అనుసంధానం చేశారు.

బాన్సువాడ డివిజన్‌లో..

బాన్సువాడ డివిజన్‌లోని బాన్సువాడ, బాన్సువాడ రూరల్, బీర్కూర్, నస్రుల్లాబాద్, నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, మేనూర్ మండలాల్లో 97,430 మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న విద్యుత్ వినియోగదారులు సర్వీసు నంబర్లకు తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డుల నంబర్లను అనుసంధానం చేశారు. వీరిలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. ఈ నెల 15 వరకు 53,695 మంది వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేశారు. ఒక్క బాన్సువాడ డివిజన్ పరిధిలో రూ. కోటి 23 లక్షల 80 వేల 176 జీరో బిల్లులు జారీ చేశారు. అయితే జీరో బిల్లు రాని, తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. తెల్లరేషన్, ఆధార్ కార్డుల నంబర్లు, పోన్ నంబర్, విద్యుత్ సర్వీసు కనెక్షన్ నంబర్ వివరాలతో కూడిన ప్రజాపాలన దరఖాస్తును గ్రామీణ ప్రాంతాల్లో మండల ప్రజాపరిషత్ కార్యాలయం, పట్టణాలు, నగరాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో అందించాల్సి ఉంటుంది. వీరి వివరాలు ఆయా కార్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతారు. కాగా 200 యూనిట్ల తర్వాత ఒక్క యూనిట్ అధికంగా వినియోగించినా వినియోగదారుడు మొత్తం బిల్లు చెల్లించాలి. 200 వరకు మాత్రమే జీరో బిల్లు వస్తుంది.

పథకాలు లబ్ధిదారులకు అందాలి



బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

బాన్సువాడ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం బాన్సువాడలో తన నివాసానికి భారీ ఎత్తున కార్యకర్తలు, అభిమానులు ఆయన్ని కలిసి సన్మానించారు. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు సర్వే చేస్తున్నారని, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించి ప్రభుత్వ పరంగా ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసాని శేఖర్‌రెడ్డి, ఖలేక్, అజీం, దాసరి శ్రీనివాస్, బోయిని శంకర్, బోయిని హన్మండ్లు, దొంతురాం కాశీరం, సాయిలు, తోట ప్రభాకర్, లక్ష్మినారాయణ, శహాబ్, మన్నన్, కొట్టం గంగాధర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడికి సన్మానం



భిక్కనూరు : బీజేపీ మండలాధ్యక్షుడిగా ఎంపికైన ఉప్పరి రమేశ్‌ను భిక్కనూరు మండల కేంద్రంలో ముదిరాజు యువజన సంఘం ప్రతినిధులు మంగళవారం సన్మానించారు. స్థానిక పెద్దమ్మ ఆలయంలో పూజలు చేసిన అనంతరం రమేశ్‌ను శాలువతో జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువజన సంఘం ప్రతినిధులు నర్సింలు, చింటూ, సందీప్, ఇస్కానిపేట రాజు, సిద్దగిరి, రమేష్, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌కు..



నిజాంసాగర్(జుక్కల్) : ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా నియామకమైన కాసుల బాల్‌రాజ్‌ను మంగళవారం జుక్కల్ మండల మున్నూరు కాపులు ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపులకు కార్పొరేషన్ చైర్మన్ కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు జుక్కల్ మండల అధ్యక్షులు అస్పత్ వార్ వినోద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి



భిక్కనూరు : సాయుధపోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రెండవ వర్థంతిని భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు, నేతలు బాలయ్య, నర్సింలు, రమణ, శ్యామల సత్యవ్వ, రేణుక బాలమణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవునిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



భిక్కనూరు : మండలంలోని లక్ష్మీదేవునిపల్లి కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని కార్యకర్తలు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనుగు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొత్త సిద్ధయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా అలకుంట నర్సింలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పుల్లురి భూమయ్య ఎన్నికయ్యారు.

పన్నులు వసూలు చేయాలి



నస్రుల్లాబాద్(భాన్సువాడ) : మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటి, నల్లా పన్నులను వంద శాతం వసూలు చేయాలని ఎంపీవో రాము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేశారు. ఆయన వెంట పంచాయతి కార్యదర్శి రాజేష్ ఉన్నారు.

గాలికుంటు టీకాలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం పశువులకు పశువైద్య శాఖ అధ్వర్యంలో గాలి కుంటు టీకాలు వేయడం జరిగింది. దీనిలో భాగంగా గ్రామంలో గల 145 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రోహిత రెడ్డి,సిబ్బంది తుకారాం, బాబయ్య, శ్రీనివాస్,గోపాల్ మిత్ర సాయిలు ఉన్నారు.

పోలీసుల తనిఖీలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో పోలీసులు వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృశ్యా ఎస్సై మహేష్ వాహనాలను తనిఖీ చేశారు. 50 వేల రూపాయలకు మించి నగదును వెంట తీసుకుని వెళ్లే వారు దానికి సంబంధించిన ఆధారాలను చూపాల్సి ఉంటుందన్నారు.

ఆర్డీవోను కలిసిన బీజేపీ నాయకులు



బాన్సువాడ : బాన్సువాడ ఆర్డీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన రమేష్ రాథోడ్‌ను మంగళవారం బీజేపీ నాయకులు కలిసారు. ఆర్డీవోను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీవోను కలిసిన వారిలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, నాయకులు శంకర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, సాయిబాబా, హన్మండ్లుయాదవ్, సాయికిరణ్, సుధాకర్, పండరి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మైలారం సొసైటీ చైర్మన్ రాజీనామా



పెర్క శ్రీనివాస్

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామ పీఏసీఎస్ చైర్మన్ తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసంపై ప్రయత్నాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు ముందస్తుగానే రాజీనామా చేయాలని నిర్ణయించుకుని డీసీవో కార్యాలయంలో రాజీనామా అందించారు. మండలంలోని ఇదివరకు దుర్కి పీఏసీఎస్ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్ బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం విదితమే.

పలువురి రక్తదానం



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ పట్టణానికి చెందిన భాగ్యశ్రీ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అలాగే షాపింగ్‌మాల్‌కు మేనేజర్ అన్నం రవీందర్, అతని మిత్రులు పలువురు బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు. పుట్టిన రోజు సందర్బంగా రక్తదానం చేయడం ఆనందంగా ఉందని అన్నం రవీందర్‌తో పాటు అతని మిత్రులు పూజం జీవన్, నరేష్, నంద్యాల శ్రీనివాస్, నవీన్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం



మద్నూర్(జుక్కల్) : మండలంలోని పెద్ద తడ్గూర్‌లో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. నీటి సమస్యలను ఆయన వద్దకు తీసుకెళ్లగా స్పందించారు. మంగళవారం గ్రామంలో బోరు వేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండవార్ రాజు, ఈరన్న, మొగులాజీ, గ్రామస్తులు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఈనెల 8న షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో కార్పెంటర్ షాపు పూర్తిగా దగ్ధం కాగా బాధితుడు కమ్మరి దత్తాద్రికి మాజీ సర్పంచ్ నిట్టు వెంకట్‌రావు రూ. 15 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కార్పెంటర్‌లు రాములు, మురళి, లక్ష్మీపతి, బాలరాజు, కాంతం తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు



పొగాకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : అకాల వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పంటను మంగళవారం ఏవో ప్రజాపతి, ఆయా గ్రామాల్లో ఏఈవోలు పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 90 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఏవో తెలిపారు. నివేదికను అధికారులకు పంపుతమాన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్) : అకాల వర్షంతో నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి వివరాలను సేకరిస్తున్నారు. మండలంలోని హజ్గుల్, పుల్కల్, శెట్లూర్, ఖద్గాం ఆయా గ్రామాలలో రాళ్ల వర్షం కురవడంతో వరి, పొగాకు, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగిందని ఏవో లింగం తెలిపారు. వరి 400 ఎకరాలు, పొగాకు 80 ఎకరాలు, మొక్కజొన్న 200 ఎకరాలలో నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు : మండలంలో మూడురోజుల క్రితం కురిసిన వడగండ్ల వానకు 3,792 ఎకరాల్లో పూర్తిగా పంట నష్టం వాటిల్లినట్లు భిక్కనూరు వ్యవసాయాధికారిణి రాధ శనివారం తెలిపారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది పర్యటించి పంట నష్టంను అంచనా వేస్తున్నారని చెప్పారు. మరో వెయ్యి ఎకరాల్లో పంట స్వల్పంగా నష్టపోయిందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అధికారులు ప్రతిరైతు వద్దకు వస్తారన్నారు.

ఆధ్యాత్మికం

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్ సుజాత, జడ్పీటీసీ ఉషాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతామందిరం వార్షికోత్సవం



కామారెడ్డి అర్బన్ : స్థానిక శ్రీకృష్ణ గీతా మందిరం వార్షికోత్సవం మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం గాయత్రీ యజ్ఞం, ఆచార్య సత్యమిత్ర ఆర్య, విదూషిమణి కవిత ఆర్య ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, అనంతరం మధ్యాహ్నం మహాప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతా మందిరం ప్రతినిధులు పాత అశోక్, పార్శి రాజేందర్, అర్వపల్లి రమేష్, పాత వెంకటేశం, మ్యాడం సుదర్శన్, టంకరి రాజయ్య, పాత బాలయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



బాన్సువాడ : తెలంగాణ తిరుమల తిరుపతి (తిమ్మాపూర్) వెంకటేశ్వర ఆలయంలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం నాటితో ముగిసాయి. చివరి రోజున వెంకటేశ్వర స్వామికి మహాపూర్ణహుతి నిర్వహించారు. పుష్కరిణిలో స్వామి విగ్రహాలకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు చక్రస్నానం చేయించారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోచారం కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

సంక్షిప్తం

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

తాడ్వాయి (ఎల్లారెడ్డి) : మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులు, బాలికల గురుకుల పాఠశాలలో 134 మంది విద్యార్థులు, మండలంలోని కన్‌కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 136 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎంఈవో రామస్వామి తనిఖీ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామారెడ్డి : మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ దశరథ్ రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లుగా ఎంపీడీవో సవిత మంగళవారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

ముగిసిన తైబజార్ వేలం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ తైబజార్‌కు మంగళవారం ప్రత్యేక అధికారి శివప్రసాద్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. జీపీలో ఏర్పాటు చేసిన తైబజార్ వేలం పాటలో ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రామాగౌడ్ రూ. 1.51 లక్షల వేలం పాట పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు. మండల పంచాయతీ అధికారి కలకొండ.యాదగిరి, పంచాయతీ కార్యదర్శి మతిన్, కారోబార్ అంబయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత..

కామారెడ్డి క్రైం : 2023-2024కు గాను కామారెడ్డి జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సైబర్ క్రైం, మనీ మేనేజ్మెంట్ అంశాలకు సంబంధించి ఇటీవల పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, నినాదాలు రాయడం లాంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అడ్లూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని జి.రక్షిత, ఎనిమిదవ తరగతికి చెందిన శృతిక మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా మంగళవారం కలెక్టరేట్‌లో విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ జిల్లా మేనేజర్ భార్గవ సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్టతో పాటు బోర్లం క్యాంపులో ఉన్న గురుకుల పాఠశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎంలు శోభారాణి, పద్మకుమారి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6,7,8 తరగతులతో పాటు 9వ తరగతిలో సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 23 వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 21న పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు వారు పేర్కొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో బీఎల్‌వీ 2024-25కు గాను విద్యార్థులు దరఖాస్తులు చేసకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీబాయి తెలిపారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీచేసేందుకు ఈనెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.